## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నారాయణపేట, జూన్ 19: పర్యావరణాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత అని ఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని పరేడ్ గ్రౌండ్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భావితరాల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని మొక్కలు నాటాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ పుట్టిన రోజు, వివాహ వార్షికోత్సవం సందర్భంగా మొక్కలను నాటడం, మొక్కను బహుమతిగా అందజేయడం అలవాటుగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేంద్రుడు, డీఎస్పీలు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, సీఐలు రాంలాల్, రాములు, లక్ష్మయ్య, ఆర్ఐలు డేవిడ్ విజయ్‌కుమార్, డీసీఆర్‌బీ, ఎస్‌బీ, ఐటీ కోర్ టీం, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.



పరేడ్ గ్రౌండ్‌లో మొక్క నాటుతున్న ఎస్పీ వెంకటేశ్వర్లు

## బాల్యవివాహాలపై అవగాహన కల్పించాలి

నారాయణపేట టౌన్, జూన్ 19: గ్రామాల్లో బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రజలు, ప్రతి విద్యార్థికి అవగాహన కల్పించాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. సోమవారం పట్టణంలోని సఖి కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో పని చేస్తున్న సిబ్బంది, కేసుల వివరాలను తెలుసుకున్నారు. డొమెస్టిక్ వయోలెన్స్ కేసులను పరిశీలించి, 498ఏ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ షీ టీమ్స్, కళాజాత బృందాలతో విద్యాసంస్థల్లో బాల్యవివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్ కేసులను పరిశీలించి పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు ఇవ్వాలన్నారు. అవసరమైన కేసులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో వేణుగోపాల్, షీటీం ఎస్సై సుధామాధురి, సఖి సిబ్బంది, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## సివిల్ సమస్యలను కోర్టులో పరిష్కరించుకోవాలి

నారాయణపేట, జూన్ 19: సివిల్ సమస్యలు కోర్టులో పరిష్కరించుకోవాలని ఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల విభాగంలో ఏడుగురు బాధితులు ఫిర్యాదులు సమర్పించారు. నేరుగా ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ వాటిని పరిశీలించి చట్టప్రకారం పరిష్కరించాలని ఫోన్‌లో సంబంధిత అధికారులను ఆదేశించారు.

**సైబర్‌నేరాలపై అప్రమత్తత అవసరం**

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై ఆంజనేయులు అన్నారు. సోమవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వద్ద సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై వాహనదారులు, పాదాచారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కతలప్ప, వెంకట్రాములు, హోం గార్డులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## రేపు అంతర్జాతీయ యోగా దినోత్సవం

నారాయణపేట టౌన్, జూన్ 19: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం పతాంజలి యోగా సమితి, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ యోగాసన్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పతాంజలి యోగా సమితి జిల్లా అధ్యక్షుడు సురేశ్‌కుమార్, రాజేందర్ లాహోటి తెలిపారు. సోమవారం పట్టణంలోని యోగా శిక్షణా కేంద్రంలో కరపత్రాలు ఆవిష్కరించారు. మహిళలు, యువకులు, విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సత్యనారాయణ, రూపేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అఖండ భజన ప్రారంభం

నారాయణపేట టౌన్, జూన్ 19: జూన్ మూడో వారం ప్రారంభమైనా వర్షాలు కురవని కారణంగా సోమవారం పట్టణంలోని పళ్ల ఆంజనేయ స్వామి ఆలయంలో అఖండ భజన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్చకుడు శ్రీపాద మాట్లాడుతూ.. అఖండ భజన కార్యక్రమం మూడు రోజులపాటు కొనసాగుతుందని, చివరి రోజు బుధవారం అనంతశయన ఆలయంలో వరుణయాగం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు గోవిందప్ప, హుస్సేనప్ప, నర్సప్ప, బుగ్గప్ప, రామప్ప, బస్వరాజ్, ప్రభాకర్‌రెడ్డి, లింగు పాల్గొన్నారు.

## వ్యక్తికి జరిమానా, రెండేండ్ల జైలు

దామరగిద్ద, జూన్ 19: బాలికను వేధించిన వ్యక్తికి జరిమానా, జైలు శిక్షను విధించిన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. ఎస్సై కథనం ప్రకారం.. కానుకుర్తిలో 2015లో చోటుచేసుకున్న ఘటనపై నమోదైన కేసు విషయమై సోమవారం కోర్టులో 9మంది సాక్ష్యుల వాదనలు విని జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ఫర్వీన్ బేగం నిందితుడికి రూ.500 జరిమానాతోపాటు రెండేండ్ల జైలుశిక్ష విధించాలని ఎస్సై తెలిపారు. అమ్మాయిలను వేధించడం, మహిళపై అగౌరవంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ వెంకటశ్వర్లు ఆదేశాలు ఉన్నాయని, జాగ్రత్తగా ఉండాలన్నారు.

# ఇంటింటి సర్వే పకడ్బందీగా చేయాలి

- 'ప్రజావాణి' ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచొద్దు
- కలెక్టర్ కోయ శ్రీహర్ష

నారాయణపేట టౌన్, జూన్ 19: ఓటరు జాబితా ప్రకారం ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. సోమవారం పట్టణంలోని 15వ వార్డులో ఇంటింటి సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. జాబితాలోని వివరాల ప్రకారం ఇంటి నెంబర్, కుటుంబ సభ్యుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాబితాలో ఓటరుగా నమోదైన ఓటరు మరోచోటుకు బదిలీ అయిన, మరణించినవారి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని బీఎల్‌వోలకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో రాంచందర్, తాసీల్దార్ దానయ్య, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.



బీఎల్‌వోతో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీహర్ష

**ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచొద్దు**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచొద్దని కలెక్టర్ శ్రీహర్ష అధికారులకు సూచించారు. సోమవారం పట్టణంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా రాసిచ్చారు. ఫిర్యాదులను నేరుగా స్వీకరించిన కలెక్టర్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



మరికల్‌లో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్

**జాబితాలో తప్పులుండొద్దు**

మరికల్, జూన్ 19: ఓటరు జాబితా ప్రకారం ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని, ఎక్కడా తప్పులు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ సూచించారు. సోమవారం మండలకేంద్రంలో అదనపు కలెక్టర్ పర్యటించారు. ముందుగా ప్రభుత్వ దవాఖానను పరిశీలించారు. రోగులకు సరైన వైద్యం అందుతుందా లేదా అని తెలుసుకున్నారు. గర్భిణులకు న్యూట్రిషన్ కిట్‌లు ఇవ్వాలని సూచించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో కాసేపు సరదాగా గడిపారు. అనంతరం బూత్ లెవల్ అధికారులు చేపడుతున్న ఇంటింటి సర్వే ప్రక్రియను పరిశీలించారు. పటేల్‌రోడ్డు, శివాజీనగర్‌లో నిర్వహిస్తున్న సర్వేలో పాల్గొని ఓటరు వివరాలు తెలుసుకున్నారు. కుటుంబానికి సంబంధించి మొత్తం ఓటర్లు ఒకే దగ్గర ఉండేటట్లు చూడాలని, కుటుంబంలో ఎవరైనా మృతిచెందితే ఆ ఓటును జాబితా నుంచి తొలగించాలని సూచించారు. ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలన్నారు. ఇంటింటి సర్వేలో ఎక్కడా నిర్లక్ష్యం చేయకుండా ప్రతిఇంటినీ సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ రాంకోటి, డీటీ శ్రీనివాసులు, ఆర్ఐలు సుధాకర్‌రెడ్డి, శ్రీశైలం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతి, వైద్యాధికారి రాఘవేందర్‌రెడ్డి, సిబ్బంది అరవింద్, బస్వరాజ్, సత్యనారాయణ, బీఎల్‌వోలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల అభివృద్ధే పభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి**

మక్తల్ టౌన్, జూన్19: రాష్ట్రంలో చెరువులను అభివృద్ధి పర్చి, రైతాంగానికి సాగునీరు అందించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు . సోమవారం మక్తల్ పట్టణంలోని తిరుమలయ్య చెరువు అభివృద్ధిలో భాగంగా చెరువు కట్టపై ముళ్లకంపను తొలగించే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెరువుల అభివృద్ధితోనే ఆయకట్టు రైతులకు సాగునీరు అందుతుందని, రైతులు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. మక్తల్ తిరుమయ్య చెరువు అభివృద్ధికి రూ.10లక్షలతో పనులను ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

**ఆయిల్ పాం సాగుకు సహకారం**

రాష్ట్రంలో ఆయిల్ పాం సాగుచేసే రైతులకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకారం అందిస్తుందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పాం తోటల పెంపకంపై అవగాహన కల్పించేందుకు ఖమ్మం జిల్లాలోని అశ్వరావుపేటకు రైతులు వెళ్తున్న బస్సును జెండా ఊపి ఎమ్మెల్యే చిట్టెం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆయిల్ పాం సాగుచేసే రైతులకు ప్రభుత్వం మొక్కలు, డ్రిప్‌కు పూర్తిస్థాయిలో సబ్సిడీని అందజేస్తుందన్నారు. మొక్కలు నాటిన తర్వాత వాటి సంరక్షణకు సంవత్సరానికి ఎకరాకు రూ.4200 నాలుగేండ్లపాటు రైతుకు ఇస్తుందన్నారు. 45 మంది రైతులు తరలివెళ్లినట్లు పేర్కొన్నారు.

**మక్తల్ మున్సిపల్ అభివృద్ధే ధ్యేయం**

నూతనంగా ఏర్పడిన మక్తల్ మున్సిపాలిటీని అన్నిహంగుల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్ర మన్సిపాలిటీలోని 8వ వార్డు గార్లపల్లిలో రూ.10లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. త్వరలోనే వార్డులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, హర్టికల్చర్ అధికారి సమీనాబేగం, ఏవో మితున్ చక్రవర్తి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.



తిరుమలయ్య చెరువు కట్ట పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం



మన ఊరు-మనబడి పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

## విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

కోస్గి, జూన్ 19: ప్రభుత్వం సర్కారు బడుల విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్న పాఠ్యపుస్తకాలను మండలంలోని నాచారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సర్పంచ్ వెంకట్రాములు, ఉపాధ్యాయులు సోమవారం పంపిణీ చేశారు. విద్యార్థులు మంచిగా చదువుకొవాలని సర్పంచ్ కోరారు. అనంతరం ఎంపీపీ మధుకర్‌రావు, జెడ్పీటీసీ ప్రకాశ్‌రెడ్డి మంగళవారం ప్రారంభమయ్యే మన ఊరు- మనబడి కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించనున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ వెంకటయ్య, హెచ్‌ఎం మధుసూదన్, ఉపాధ్యాయులు వీరమల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సూచిక బోర్డుల ఏర్పాటు

నారాయణపేట, జూన్ 19: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు మలుపు వద్ద ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి తెలిపారు. సోమవారం మార్కెట్ యార్డు ప్రధాన రహదారి మలుపు వద్ద సూచిక బోర్డును ఏర్పాటు చేసి అనంతరం ఆమె మాట్లాడారు. వాహనదారులు బోర్డులను గమనించి నెమ్మదిగా వెళ్లాలని కోరారు. సూచిక బోర్డులు ఏర్పాటు చేయించిన చైర్‌పర్సన్‌ను సీఐ రవిబాబు అభినందించారు. కార్యక్రమంలో ఎస్సై సురేశ్, వైస్ చైర్మన్ లక్ష్మీకాంత్, కార్యదర్శి భారతి, సూపర్‌వైజర్ లక్ష్మణ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

## ఆత్మరక్షణకు కరాటే

మరికల్, జూన్ 19: బాలబాలికల ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని సర్పంచ్ గోవర్ధన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలోని బాలికలకు 100 మందికి నాన్‌చాకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. మరికల్‌కు చెందిన ఆర్మీ జవాన్ యాదయ్య జన్మదినాన్ని పురస్కరించుకొని బాలికల ఆత్మరక్షణకు యువక మండలి ఆధ్వర్యంలో నాన్‌చాక్‌లు అందజేసినట్లు పేర్కొన్నారు. వేసవిలో బాలికలకు యువక మండలి ఆధ్వర్యంలో ఉచిత కరాటే శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. కరాటే మాస్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. బాలికలకు వారంలో మూడు రోజులు ఉదయం ఉచితంగా కరాటే శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యువక మండలి అధ్యక్షుడు రవికిరణ్, కార్యదర్శి రాఘవేంద్ర, యువకులు, హెచ్‌ఎం మనోరంజని, దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

## వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు

నారాయణపేట రూరల్, జూన్19: దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మంగళవారం నిర్వహించే విద్యాదినోత్సవం సందర్భంగా జాజాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో శివరాములు ప్రథమ, భారతి ద్వితీయ బహుమతికి, డ్రాయింగ్‌లో రుత్విక ప్రథమ, శిరీష ద్వితీయ బహుమతికి ఎంపికయ్యారు. వీరికి మంగళవారం బహుమతులు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం కనకప్ప, సత్యనారాయణ, భానుప్రకాశ్, శోభారాణి, శిరీష, నిర్మల, మధుసూదన్‌రావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## అపరచితులపై అప్రమత్తం

కృష్ణ, జూన్ 19: గ్రామాల్లో అపరిచితులపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై విజయ్‌భాస్కర్ తెలిపారు. మండలంలోని ఆలంపల్లిలో ఎస్సై ఆధ్వర్యంలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు, కళాబృందం సభ్యులు పాలొన్నారు.